# మెటా సంచలన నిర్ణయం..




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' తన ఫోటో, వీడియో షేరింగ్ ప్లాట్‌ఫారమ్ ఇన్‌స్టాగ్రామ్‌లో కీలక మార్పు చేపట్టింది. ఇన్‌స్టాగ్రామ్ యూజర్ల వ్యక్తిగత సంభాషణలకు రక్షణగా ఉండే 'ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్' సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మే 8 నుండి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్‌ను వినియోగించే వారి సంఖ్య ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మెటా సమర్థించుకుంది. సాధారణంగా ఎండ్‌టుఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంటే, పంపిన వారు, స్వీకరించే వారు తప్ప మూడో వ్యక్తి (చివరికి మెటా కూడా) ఆ సందేశాలను చూడటానికి లేదా వినడానికి వీలుండదు. అయితే, ఇకపై ఇన్‌స్టాగ్రామ్ చాట్స్‌లో ఈ సౌకర్యం ఉండదు.

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM


# అషురెడ్డికి పోలీసుల నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** నటి అషురెడ్డికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. నటి, బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డి తన కుమారుడిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ.9.35 కోట్లు వసూలు చేసిందని హైదరాబాద్‌కు చెందిన సత్యనారాయణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గతంలోనే పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కేసు కొట్టేయాలని అషురెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అషురెడ్డి, ఆమె తల్లియశోదరెడ్డిలపై దర్యాప్తు నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. వారి పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో తాజాగా సీసీఎస్ పోలీసులు విచారణకు హాజరు కావాలని నోటీసులిచ్చారు.


8-5-2026 (Friday) MAIN EDITION

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను నిలదీసిన రైతులు




**అక్షరటుడే, జగిత్యాల:** జగిత్యాలలో వర్షానికి తడిచిన ధాన్యం పరిశీలనకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ వెళ్లారు. దీంతో రైతులు ఆయనను నిలదీశారు. అంతా అయిపోయాక వచ్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు ఏం చేశారని ప్రశ్నించారు.

## విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్..



**అక్షరటుడే, చెన్నై:** తమిళనాడులో రాజకీయ ప్రతిష్టంభనకు తెర పడింది. మూడు రోజులుగా నెలకొన్న సస్పెన్స్‌కు తెర పడింది. టీవీకే అధినేత విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయింది. టీవీకేకు సీపీఐ, సీపీఎం, వీసీకే మద్దతు ప్రకటించాయి. ఇప్పటికే కాంగ్రెస్ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే.

## మార్కెట్ సూచీలు రోజంతా నష్టాల్లోనే..



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్‌ల మధ్య మళ్లీ పరస్పర దాడులు మొదలవడంతో ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. దీంతో గ్లోబల్ మార్కెట్లు ఒత్తిడికి గురవుతున్నాయి. సెన్సెక్స్ 516 పాయింట్ల నష్టంతో 77,328 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల నష్టంతో 24,176 వద్ద స్థిరపడ్డాయి.



## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తమిళనాడు డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియా కూటమి గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీతో పొత్తు ముగిసినట్లేనని స్పష్టం చేసింది. ఇకపై లోక్‌సభలో విపక్షాలతో కలిసి కూర్చోలేమని పేర్కొంది. ఈ మేరకు తమ పార్టీ ఎంపీలకు వేర్వేరు సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు లేఖ రాసింది.



## భారీగా పెరిగిన చికెన్ ధరలు

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో చికెన్ ధరలు భారీగా పెరిగాయి. ఎండలు మండుతుండడంతో కోళ్లఫారాల్లో కోళ్లు చనిపోతున్నాయి. దీంతో పలు నగరాలలో చికెన్ ధరలు భారీగా పెరిగాయని చికెన్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. గత ఆదివారం హైదరాబాద్‌లో స్కిన్‌లెస్ చికెన్ కిలోకు రూ.260 నుంచి రూ.280 వరకు ఉండగా.. తాజాగా ఆ రేటు రూ.340కి పెరిగింది. ఐదు రోజుల వ్యవధిలోని రూ.80 వరకు ధర పెరగడం గమనార్హం. దీంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో శుభకార్యాల సందడి నెలకొంది. మరోవైపు పలు గ్రామాల్లో జాతరలు, ఉత్సవాలు మేలో జోరుగా సాగుతాయి. ఈ క్రమంలో చికెన్ రేట్లు పెరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రే భార్యను దుండగులు హత్య చేశారు. ఆమె ఇంట్లో పనిచేసే నేపాలీ మహిళ మరో ముగ్గురితో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడింది. అనంతరం బంగారు ఆభరణాలు, నగదుతో పారిపోయారు. డీజీపీ సీవీ ఆనంద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను నియమించారు.** –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# రిటైర్డ్ ఐపీఎస్ భార్య హత్య

- జూబ్లీహిల్స్‌లో దారుణం
- నేపాలీ గ్యాంగ్ ఘాతుకం
- నమ్మించి నయవంచన
- ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు

హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ ఐఏఎస్ క్వార్టర్స్‌లో రిటైర్డ్ ఐపీఎస్ వినయ్ రంజన్ రే భార్య తనూజ (55) గురువారం రాత్రి హత్యకు గురయ్యారు. శుక్రవారం ఉదయం ఈ ఘటన వెలుగు చూసింది. వారింట్లో పని చేసే నేపాల్‌కు చెందిన పని మనిషి కల్పన ఈ హత్య చేసినట్లు గుర్తించారు. ఆమెకు మరికొందరు సహకరించారు. మరో ముగ్గురితో కలిసి ముందస్తు ప్రణాళికతో ఈ హత్యకు కల్పన పాల్పడిందని పోలీసులు తెలిపారు. హత్య అనంతరం ఇంట్లోని బంగారం, నగదును బ్యాగుల్లో తీసుకుని వారు పరారయ్యారు.

### నాలుగు బృందాలతో గాలింపు

తనూజ రే హత్య సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. డీజీపీ సీవీ ఆనంద్, సీపీ సజ్జనార్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటెలిజెన్స్ చీఫ్ కూడా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు ఆరా తీశారు. నేపాలీ ముఠాను పట్టుకోవడానికి ప్రత్యేకంగా 4 బృందాలను ఏర్పాటు చేశారు.

### రెచ్చిపోతున్న నేపాలీ ముఠాలు

నగరంలో ఇటీవల నేపాలీ ముఠాలు రెచ్చిపోతున్నాయి. సంపన్న వర్గాలను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నాయి. నిందితులు ముందుగా ధనవంతుల ఇళ్లలో పని చేరుతున్నారు. అనంతరం రెక్కీ నిర్వహించి పక్కాగా దోపిడీలకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఇటీవల అనేకం చోటు చేసుకుంటున్నాయి. గతేడాది సికింద్రాబాద్‌లోని కార్ఖానాలో రిటైర్డ్ ఆర్మీ కల్నల్ గిరి ఇంట్లో నేపాల్‌కు చెందిన దంపతులు చోరీ చేశారు. కల్నల్ గిరిని తాళ్లతో కట్టేసి, ఆయన మూతికి ప్లాస్టర్ వేశారు. అనంతరం ఇంట్లో ఉన్న 25 తులాల బంగారు ఆభరణాలు, 23 లక్షల రూపాయల నగదు దోచు కుని పరారయ్యారు. ఈ ఏడాది మార్చిలో జూబ్లీ హిల్స్‌లో నేపాల్‌కు చెందిన ముఠా చోరీ చేసింది. రోడ్ నంబర్ 25లోని అనిరుధ్ రెడ్డి అనే వ్యక్తి నివాసంలో పని మనుషులుగా చేరిన దంపతులు మొదట నమ్మకంగా పని చేశారు. అనంతరం రూ.2 కోట్ల విలువైన వజ్రాభరణాలతో పరారయ్యారు.




### కేటీఆర్ ఆగ్రహం


రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భార్య హత్యపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయన్నారు. గురువారం రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని దారుణంగా కత్తితో పొడిచి చంపారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం, వారిని అరెస్టు చేయడం, వేధించడం వైపు మొత్తం పోలీసు యంత్రాంగాన్ని, నిఘా వ్యవస్థను మళ్లిస్తున్నప్పుడు, శాంతిభద్రతల పతనం కాకపోతే ఏం అవుతాయని ఆయన ప్రశ్నించారు. హోం మంత్రిగా కొనసాగుతున్న రేవంత్ రెడ్డి శాంతిభద్రతలను కాపాడడంలో విఫలమయ్యారని విమర్శించారు.

## తెలంగాణలో పలు బీసీ కులాల పేర్లు మార్పు




**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలోని వెనుకబడిన తరగతుల (బీసీ) సామాజిక గౌరవాన్ని పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక అడుగు వేసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న విన్నపాలను ఆలకించిన సర్కార్, బీసీ జాబితాలో అగౌరవంగా ఉన్న కొన్ని కులాల పేర్లను మారుస్తూ కేబినెట్ ద్వారా కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం పేర్ల మార్పు మాత్రమే కాకుండా, పలు కులాలకు గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడిస్తూ అధికారిక రికార్డులను సవరించాలని నిర్ణయించింది. ఈ మార్పుల ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులు సామాజికంగా మరింత ఆత్మగౌరవంతో ముందుకు సాగే అవకాశం లభించనుంది. బీసీ కమిషన్ సిఫార్సుల మేరకు గ్రూప్‌ఏ విభాగంలో ప్రభుత్వం ప్రధానమైన మార్పులు చేసింది. ముఖ్యంగా ఇప్పటివరకు రికార్డుల్లో ఉన్న 'దొమ్మర' అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో 'గడ వంశీయ' అనే పేరును ఖరారు చేశారు. అలాగే 'పిచ్చకుంట్ల' అనే పదాన్ని మారుస్తూ, ఆ కులాన్ని ఇకపై 'వంశ రాజ్'గా వ్యవహరించాలని నిర్ణయించారు. కులాల పేర్లు పిలవడానికి ఇబ్బందికరంగా ఉండకూడదన్న ఉద్దేశంతో తీసుకున్న ఈ నిర్ణయం ఆయా వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. కేవలం పేర్ల మార్పుకే పరిమితం కాకుండా, కొన్ని కులాలకు గౌరవప్రదమైన గుర్తింపునిచ్చేలా పర్యాయపదాలను ప్రభుత్వం చేర్చింది. బుడబుక్కల కులానికి 'శివ క్షత్రియ' అనే పదాన్ని జతచేయగా, వన్నార్ అనే పదం స్థానంలో 'ధోబీ'ని చేర్చి మొత్తంగా 'రజక, చాకలి, ధోబీ'గా రికార్డుల్లో నమోదు చేయనున్నారు.

## 'రైతుతో కాళ్లు మొక్కిస్తున్న ప్రభుత్వం..'



**అక్షరటుడే, హైదరాబాద్:** దేశానికి అన్నం పెట్టే రైతుతోనే అధికారుల కాళ్లు మొక్కిస్తున్న ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ధాన్యాన్ని ప్రభుత్వం కొనకపోతే రైతన్నకు దిక్కెవరు అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదు. కాంటాలు కాక, లారీలు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కేంద్రాలకు వచ్చే అధికారులకు రైతులు తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు ఓ అధికారిణి కాళ్లపై ధాన్యం కొనుగోలు చేయాలని వేడుకున్నారు. ఈ వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసిన హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.


## 'తారా' వెపన్ టెస్ట్ సక్సెస్

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో), భారత వైమానిక దళం (ఐఏఎఫ్) సంయుక్తంగా ఒడిశా తీరంలో టాక్టికల్ అడ్వాన్స్‌డ్ రేంజ్ ఆగ్మెంటేషన్ ఆయుధం తొలి ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించాయి. మాడ్యులర్ రేంజ్ ఎక్స్‌టెన్షన్ కిట్ అయిన టీఏఆర్ఏ, అన్‌గైడెడ్ వార్‌హెడ్‌లను ప్రెసిషన్ గైడెడ్ ఆయుధాలుగా మార్చగల భారత మొట్టమొదటి స్వదేశీ గ్లైడ్ ఆయుధ వ్యవస్థ. భూమిపై ఉన్న లక్ష్యాలను నిర్వీర్యం చేయడానికి, తక్కువ ఖర్చుతో కూడిన ఆయుధం విధ్వంసక శక్తిని, కచ్చితత్వాన్ని పెంచేందుకు, హైదరాబాద్‌లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ ఇతర డీఆర్‌డీవో ప్రయోగశాలలతో కలిసి టీఏఆర్ఏను రూపొందించింది. భారతదేశ స్వదేశీ రక్షణ సామర్థ్యాలను పెంపొందించడంలో ఇది ఒక ముఖ్యమైన పరిణామమని అభివర్ణిస్తూ డీఆర్‌డీవో, ఐఏఎస్‌ను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.




## ఫెమినా బ్యూటీ అవార్డ్స్ లో రియా మెరుపులు..

**అందాల భామ రియా చక్రవర్తి గురించి పరిచయాలు అవసరం లేదు. కెరీర్ ఆరంభంలో విజేగా అలరించిన ఈ బ్యూటీ, ఆ తర్వాత వెండితెరపై తన మార్క్ చూపించింది. మధ్యలో కొన్ని ఒడిదుడుకులు ఎదురైనా, వాటని దాటుకుని మళ్లీ గ్లామర్ ప్రపంచంలో ఫుల్ బిజీ అయిపోయింది. తాజాగా ఫెమినా బ్యూటీ అవార్డ్స్ కోసం రియా చేసుకున్న ఫోటోషూట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. రీసెంట్‌గా జరిగిన ఫెమినా బ్యూటీ అవార్డ్స్ వేడుకలో రియా చక్రవర్తి జ్యూరీ మెంబర్‌గా వ్యవహరించారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేస్తూ, "జ్యూరీ డ్యూటీని బాగా ఎంజాయ్ చేశాను" అంటూ పోస్ట్ పెట్టింది. అయితే ఆ పోస్ట్‌లో ఆమె ధరించిన డ్రెస్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు.** - అక్షరటుడే, సినిమాడెస్క్



## బీటెక్ విద్యార్థి దారుణ హత్య

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలోని సికింద్రాబాద్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓ అమ్మాయిని ప్రేమించిన యువకుడిని ఆమె బంధువులు నడిరోడ్డుపై దారుణంగా హత్య చేశారు. కత్తితో 17 చోట్ల పొడిచి హతమార్చారు. జవహర్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న యవన్ అనే యువకుడు బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. అతడు నాలుగేళ్లుగా సీతాఫల్‌మండి ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయం తెలిసిన యువతి తల్లిదండ్రులు పలుమార్లు అతడిని హెచ్చరించారు. అయితే వారి మాటలు పట్టించుకోని యవన్ సీతాఫల్‌మండి ప్రాంతంలో ఉండే తన స్నేహితుడి ఇంట్లో ఉంటూ తరచూ యువతిని కలుస్తున్నాడు. దీంతో యువతి కుటుంబ సభ్యులు గురువారం రాత్రి బైక్‌లపై వచ్చి చిలకలగూడలో యవన్‌పై దాడి చేశారు. కత్తులతో పొడిచారు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## డ్రగ్స్ కట్టడికి డ్రోన్‌లతో నిఘా..: సీపీ సుమతి

**అక్షరటుడే, హైదరాబాద్‌సిటీ:** హైదరాబాద్ నగరంలో డ్రగ్స్ దందా జోరుగా సాగుతోంది. విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మల్కాజ్‌గిరి సీపీ సుమతి కీలక చర్యలు చేపట్టారు. డ్రగ్స్ నివారణకు హాస్టళ్లపై డ్రోన్‌లతో పెడతామని తెలిపారు. మల్కాజ్‌గిరి కమిషరేట్ పరిధిలో విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు డ్రగ్స్ నిరోధక వ్యూహాన్ని ముమ్మరం చేశారు. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌లోని హాస్టళ్లపై డ్రోన్‌లతో తనిఖీలు చేశారు. విద్యార్థులకు అక్కడికక్కడే డ్రగ్ టెస్టులు చేశారు. సీపీ సుమతి శుక్రవారం ఉదయం మీడియాతో మాట్లాడారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరోధించడానికి మరియు విద్యాసంస్థలు, హాస్టళ్ల చుట్టూ పనిచేస్తున్న స్థానిక మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లను నిర్మూలించడానికి సాంకేతికత ఆధారిత పోలీసింగ్‌ను అవలంభిస్తున్నారని సీపీ తెలిపారు.